


తోపుడుబండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్



తిరుపతి నగరంలో తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకున్నటువంటి వారికి మున్సిపల్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని సోమవారం తోపుడు పండ్ల వ్యాపారస్తులు సంఘం నగర ప్రధాన కార్యదర్శి బుజ్జీ ఆధ్వర్యంలో కమిషనర్ అదితి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. గుర్తింపు కార్డులు లేవన్న సాకుతూ మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తోపుడుబండ్ల వ్యాపారులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, ఫుడ్‌కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం సహకారం అందించి హాకర్స్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాకర్స్ యూనియన్ నాయకులు మణిమాల, మునిరత్నం, కుమార్ సిద్ధూ తదితరులు పాల్గొన్నారు

పేదలకు వరం చంద్రన్న బీ(దీ)మా..!

'మిత్ర'లను ఆదుకోండి

ప్రజాశక్తి - రామచంద్రాపురం

'చంద్రన్న బీమా.. పేదల పాలిట వరం కానుంది.. అలానే బీమా మిత్రులనూ కొనసాగించి తమకు ఉపాధి చూపాలని' బీమా మిత్రలు కోరుతున్నారు. గత చంద్రబాబు పాలనలో రూ.5లక్షలు ఉన్న చంద్రన్న బీమాను తాజాగా 10 లక్షలు పెంచారు. బీమా మిత్రలను కొనసాగిస్తే తమ కుటుంబాల్లో వెలుగు నింపిన వారవుతారని చెబుతున్నారు. మంగళవారం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంకు రానున్న నేపథ్యంలో తమను కొనసాగించే విషయమై పునరాలోచించాలని చంద్రబాబు హయాంలో బీమా మిత్రులుగా చేసిన వారు వేడుకొంటున్నారు.

2014లో సిఎంగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబునాయుడు చంద్రన్నబీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. రూ.15కే బీమా వర్తించేలా, కుటుంబంలో 18-60లోపు వయస్సు గల ప్రతి ఒక్కరికీ వర్తించేలా చేశారు. కుటుంబ సభ్యులు సహజ మరణం చెందితే రెండు లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల బీమా వర్తింపజేసింది. లబ్దిదారులకు బీమాను అందించేందుకు 2014లో బీమా మిత్రులను డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసింది. ప్రతి మండలానికి ఇద్దరు, మున్సిపాలిటీ పరిధిలో ఐదుగురు, కార్పొరేషన్‌లో పది మందికి పైగా బీమా మిత్రులను నియమించి లబ్దిదారులకు సకాలంలో బీమా అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2019లో రాష్ట్రంలో వైఎసఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బీమా మిత్రులను తొలగించారు. ఆ సేవలను సచివాలయ సిబ్బందికి అప్పగించి, బీమా మిత్రుల వ్యవస్థను రద్దు చేశారు. దీంతో బీమా మిత్రులు ఉపాధిని కోల్పోయి ఇంటి దారి పట్టారు. అనేకమార్లు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా న్యాయం చేయాలని బీమా మిత్రులు వాపోయారు. ప్రస్తుతం తిరిగి చంద్రబాబు అధికారంలోకి రావడంతో వారిలో తిరిగి ఆశలు చిగురించాయి.

2024లో చంద్రబాబునాయుడు విజయఢంకా మోగించారు. ముఖ్యమంత్రిగా తిరిగి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో చంద్రన్నబీమా పథకం మళ్లీ వెలుగులోకి వస్తుందని, ఐదు లక్షలుగా ఉన్న బీమాను 10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. తమ ఉపాధిపైనా పునరాలోచించాలని బీమా మిత్రులు కోరుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 66 మండలాలకు కలిపి 120 మంది బీమా మిత్రలు ఉండేవారు. కార్పొరేషన్‌లో 200 మంది ఉండేవారు. వీరందరినీ వైసిపి ప్రభుత్వం తొలగించింది. రాష్ట్రవ్యాప్తంగానూ దాదాపు వీరి సంఖ్య రెండువేల పైనే ఉంటుంది. చంద్రన్న బీమా మిత్రులపై కరుణ చూపాలని వేడుకొంటున్నారు.

2004 నుంచి పనిచేస్తున్నాం



రాజ్యలక్ష్మి, తిరుపతి రూరల్

2004వ సంవత్సరంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇందిరాగాంధీ పేరిట బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. అప్పటినుంచి బీమా మిత్రులుగా ఉన్నాం. 2019లో వైసిపి అధికారంలోకి రాగానే మమ్మల్ని తొలగించేశారు. మళ్లీ చంద్రన్న పాలన రావడంతో న్యాయం చేస్తారనే నమ్మకం ఉంది.

రోడ్డున పడేశారు

కవిత, తిరుపతి అర్బన్



గత 14 సంవత్సరాలుగా బీమా పథకంలో బీమా మిత్రులుగా పనిచేశాను. 2019లో చంద్రన్న బీమా పథకాన్ని తొలగించారు. బీమా మిత్రులను రాష్ట్రవ్యాప్తంగా తొలగించి రోడ్డున పడేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహిళా బీమా మిత్రులైన తమపై దయచూపి న్యాయం చేయాలని కోరుకుంటున్నాం.

సానుభూతిపరులమనే తొలగించారు

నవనీత, వడమాలపేట



పేద ప్రజలకు చంద్రన్న బీమా ద్వారా సేవలందించే బీమా మిత్రులను 2019లో వైసిపి ప్రభుత్వం తొలగించింది. మేమంతా టిడిపి సానుభూతిపరులమని మాపై ముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చంద్రన్న బీమా మిత్రులపై కరుణ చూపి, బీమా మిత్రుల వ్యవస్థను కొనసాగించి ఉపాధి చూపాలని వేడుకొంటున్నాం.



పేదలపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం

ప్రజాశక్తి - వెంకటగిరి రూరల్

తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలోని పెట్లూరు గ్రామ సర్వే నెంబరు 12 లో గత కొంతకాలంగా నిరుపేదలు చెట్టు పుట్ట చదును చేసుకుని, గుడిసెలు నిర్మించుకుని నివాసం ఉంటుంటే ఆ గుడిసెలను సోమవారం ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా తొలగించారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. పోలీసు, ఫారెస్టు అధికారులు మహిళలని చూడకుండా గుడిసెలను, మహిళలను బలవంతంగా ఈడ్చేయడంతో గుడిసెవాసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు చెంగయ్య మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పేదలు ఈ భూమిని సాగు చేసుకుంటున్నారని, ఫారెస్టు అధికారులు జాయింట్ సర్వే పేరుతో 20 ఏళ్లుగా అధికారుల చుట్టూ తిప్పుకుంటున్నారే తప్ప, పేదలకు న్యాయం చేయలేదన్నారు. ఇంటి స్థలాలు లేక పోవడంతో వీరంతా సిపిఎంను ఆశ్రయించారు. బడుగు బలహీన వర్గాలు వేసుకున్న గుడిసెలను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఎంతోకాలంగా పేదలు చేస్తున్న పోరాటానికి పరిష్కారం చూపి, భూములు పంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలపై దౌర్జన్యం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ భూపోరాటంలో గుడిసె నిర్వాసితులు పాల్గొన్నారు. మేత పోరంబోకు భూమిని ఫారెస్టు అధికారులు తమదని చెప్పడం సరికాదన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే జాయింట్ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకూ ఈ భూములను వదిలేది లేదని హెచ్చరించారు.

నేడు కుప్పంకు సిఎం చంద్రబాబు

రెండు రోజులు బిజీబిజీ
కట్టుదిట్టమైన భద్రత..ఏర్పాట్లు పూర్తి



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యాక, తన సొంత నియోజకవర్గమైన కుప్పంకు మంగళవారం ఉదయం 12.30 గంటలకు కుప్పంలోని పిఇఎస్ మెడికల్ కాలేజీ వద్ద హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్‌లో చేరుకోనున్నారు. 12.55కు అక్కడనుంచి బయల్దేరి అదే నియోజకవర్గంలోని శాంతిపురం మండలం జల్లిగానిపల్లి, చిన్నారిదొడ్డి గ్రామాల్లో హంద్రీనీవా కాల్వను 40 నిమిషాల పాటు పరిశీలించనున్నారు. అక్కడనుంచి నేరుగా ఆర్ అండ్ బి అతిథిగృహం చేరుకుని గంటపాటు విశ్రాంతి తీసుకోనున్నారు. కుప్పం ఆర్టీసీ బస్టాండ్ (ఎన్టీఆర్ సర్కిల్)వద్ద బహిరంగసభలో ప్రసంగించనున్నారు. ఈ సభకు వేలాదిమందిని తరలించేందుకు కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, పలమనేరు ఎంఎల్‌ఎ అమరనాథరెడ్డి, సిఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పిఎస్ మనోహర్, కుప్పం సమన్వయ కమిటీ నాయకులు పిఎస్ మునిరత్నం, గౌనివాని శ్రీనివాసులు, డాక్టర్ సురేష్, డాక్టర్ వెంకటేష్, కన్నన్‌లు జనసమీకరణలో తలమునకలై ఉన్నారు. అనంతరం ఆర్ అండ్ బి అతిథిగృహంలో సాయంత్రం 4.35 గంటలకు కుప్పం నియోజకవర్గం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఆరోజు అక్కడే బస చేయనున్నారు. అదే అతిథిభవనంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు అర్జీలను స్వీకరిస్తారు. పిఇఎస్ మెడికల్ కళాశాల పక్కన ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కుప్పం నియోజకవర్గంలోని అధికారులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. భోజన విరామం అనంతరం 2.35 గంటలకు కుప్పం పార్టీ క్యాడర్‌తో సమావేశం కానున్నారు. 4.10 గంటలకు పిఇఎస్ మెడికల్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌నుంచి విజయవాడ గన్నవరం చేరుకుంటారు. సిఎం చంద్రబాబు సమక్షంలో పలువురు వైసిపి కీలక నేతలు టిడిపిలో చేరేందుకు టిడిపి నాయకులు పావులు కదుపుతున్నట్లు సమాచారం. కుప్పంలో టిడిపిని ఖాళీ చేస్తామని గతంలో ఎంఎల్‌సి భరత్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనేకమార్లు అన్నారు. దీన్ని సవాల్‌గా తీసుకుని ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ తనదైన శైలిలో వ్యూహంతో ముందుకెళ్లనున్నారు.

తిరుమల మఠాల పేరుతో కోట్లల్లో స్కాం : జనసేన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



తిరుమలలో మఠాల పేరుతో కోట్ల రూపాయల స్కాం జరుగుతుందని, స్వరూపానంద స్వామి రూల్స్‌ను అతిక్రమించి స్టార్ హోటల్‌ను తలపించేలా కొండపై అక్రమ కట్టడాలను కట్టడం ఏంటని జనసేన నేత కిరణ్ రాయల్ ప్రశ్నించారు. సోమవారం తిరుమలలోని జనసేన నేతలతో కలిసి కిరణ్ రాయల్ పలు మఠాలను సందర్శించారు. తిరుమలలో వైసీపీ నేతలు మఠాల పేరుతో పెద్ద ఎత్తున భక్తులను దోపిడీ చేస్తున్నారని, అక్రమ కట్టడాలకు పాల్పడుతున్నారని వీటన్నింటినీ జనసేన, టిడిపి అధినేతల దష్టికి తీసుకెళ్తానని, పర్మిషన్ లేకుండా నిర్మించిన అక్రమ కట్టడాలను ఈవో దష్టికి తీసుకువెళ్లి వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆధ్యాత్మిక గురువులకు సంబంధించి స్వామివారికి సేవ చేసుకొనుటకు, భక్తులకు ఉపయోగపడేలా ఉండుటకు మాత్రమే మఠాలను కేటాయిస్తారని, కానీ మఠాలు నిర్వహిస్తున్న వారు మాత్రం కొండపై పెద్ద ఎత్తున భక్తుల వద్ద దోపిడీకి పాల్పడుతున్నారని కిరణ్ ఆరోపించారు. శ్రీవారి సన్నిధిలో ఎక్కడ అవినీతికి తావు లేకుండా.. కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేస్తుందని స్వామి వారి భక్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో.. జనసేన నేతలు హరి ప్రసాద్, లోకేష్, జీవన్, సుమన్ బాబు, మంజు, కిషోర్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి ఆలయంపై ఈవో సమీక్ష

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీ వేంకటేశ్వర ఆలయం, చరిత్ర, వాస్తుశిల్పం, విశిష్టత, అనేక ఇతర సంబంధిత విశేషాలపై టీటీడీ ఈవో జె.శ్యామలరావు సమీక్షించారు. సోమవారం సాయంత్రం తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో జరిగిన సమీక్షా సమావేశంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుమల శ్రీవారి ఆలయ చరిత్ర, వైఖానస ఆగమ, జీయంగార్ వ్యవస్థ, వివిధ ఆచార వ్యవహారాలు, నిత్య, వార, మాస, వార్షిక సేవా కార్యక్రమాలు, సుప్రభాతం నుంచి ఏకాంతం వరకు ప్రతిరోజు శ్రీవేంకటేశ్వర స్వామికి నిర్వహించే వివిధ కైంకర్యాలను సవివరంగా ఈవోకు వివరించారు. అంతకుముందు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నారాయణగిరి షెడ్లను ఈఓ పరిశీలించారు. సీవీఎస్‌వో నరసింహకిషోర్, సిఈ నాగేశ్వరరావు, ఎస్ఈ -2 జగదీశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



ఎన్‌బిఎఫ్‌సి నూతన శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

ప్రముఖ నాన్- బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్ బి ఎఫ్ సి), ఫారిన్ ఎక్స్ఛేంజ్ నగదు బదిలీ సేవలు అందించే యూనిమోని ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ తమ శాఖను తిరుపతిలో సోమవారం ప్రారంభించింది. స్థానిక డి మార్ట్ ఎదురుగ, ఎయిర్ బై పాస్ రోడ్, యాదవ కాలనీ రాయల్ నగర్ ఏర్పాటుచేసిన నూతన కార్యాలయం వద్ద యూనిమోని ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండియా డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సీఏ కష్ణన్ ఆర్ మాట్లాడుతూ కస్టమర్ల సేవ, లభ్యతను మెరుగుపరచడానికి తాము తిరుపతి శాఖను అందరికీ అందుబాటులో ఉండే ప్రదేశానికి మార్చామన్నారు. కొత్త శాఖ తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న కస్టమర్లకు మెరుగైన సేవలను, ఆర్థిక మద్దతును అందించడం లో తమ నిబద్ధతను సూచిస్తుందని తెలిపారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు ఉచితంగా బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మనోజ్ వి మ్యాథ్యు (చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్), రతీష్ ఆర్ (చీఫ్ పీపుల్ ఆఫీసర్), ప్రకాష్ భాస్కర్ (నేషనల్ బిజినెస్ హెడ్ ఫారెక్స్), సిద్ద ప్రసాద్(బ్రాంచ్ హెడ్ తిరుపతి) పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రబలుతున్న 'అతిసారా'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి నియోజవర్గంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో అతిసారా క్రమంగా ప్రబలుతోంది. నీటి కలుషితానికి తోడు పారిశుద్ధ్యం అధ్వానంగా తయారు కావడంతో పల్లె వాసులు అతిసారా బారిన పడుతున్నారు. నైరుతి రుతుపవనాల కారణంగా ఇటీవల అడపాదడపా వర్షాలు కురిసాయి. పల్లెల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారయింది. పలు గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు దెబ్బ తిన్నాయి. వాటిని మరమ్మతు చేసి గ్రామీణులకు రక్షిత మంచినీటిని అందజేయాలంటే తమ వద్ద నిధులు లేవని సర్పంచులు చెబుతున్న పరిస్థితి. దీంతో గ్రామీణ ప్రజలు కలుషిత నీటిని తాగి అతి సారా బారిన పడ్డారు. తొట్టంబేడు మండలంలోని చియ్యవరం గ్రామంలో పైపులైను లీకేజీ అయ్యి రెండు నెలలు గడుస్తున్నా ఆ పంచాయతీ సర్పంచ్ గానీ, పంచాయతీ కార్యదర్శి గాని పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. దీంతో పెంచలయ్య అనే వ్యక్తి రెండు రోజుల క్రితం అతిసారా బారిన పడి ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అదేవిధంగా అదే మండలంలోని బసవయ్య పాలెం లో అంగన్వాడీ కార్యకర్త రేవతి కూడా అతిసారా బారిన పడి గత మూడు రోజులుగా ఎంజీఎం లో చికిత్స పొందుతోంది. ఇదేవిధంగా నియోజకవర్గంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది అమాయక ప్రజలు అతిసారా సోకి మంచాలకు పరిమితయామయ్యారని తెలుస్తోంది.


అతిసారతో చికిత్స పొందుతున్న అగన్‌వాడి

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లెల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవడంతో పాటు అతిసారా నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వేడుకగా క్రియా యూనివర్సిటీ స్నాతకోత్సవం

ప్రజాశక్తి- వరదయ్యపాలెం


శ్రీసిటీలోని క్రియా యూనివర్సిటీ స్నాతకోత్సవం-2024 కన్నుల పండుగగా నిర్వహించారు. కేంద్ర మాజీ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ కె.విజయరాఘవన్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రియా విశ్వ విద్యాలయ యూజీ, పీజీ విద్యార్థులు, ఐఎఫ్‌ఎంఆర్ గ్రాడ్యుయేట్ బిజినెస్ స్కూల్ రెండు, మూడు సంవత్సరాల ఎంబీఏ విద్యార్థులు, క్రియా, చెన్నై యూనివర్సిటీ పి హెచ్ డి విద్యార్థులు మొత్తం 350 మందికి డిగ్రీలు, అవార్డులు ప్రదానం చేశారు. జెరూసలేంలోని హిబ్రూ యూనివర్శిటీలో హ్యూమనిస్టిక్ స్టడీస్ ప్రొఫెసర్ డేవిడ్ షుల్‌మాన్ రెనీ లాంగ్, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ రుక్మిణి బెనర్జీ లకు వారివారి రంగాలలో విశేషమైన సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. క్రియా యూనివర్సిటీ ఛాన్సలర్ లక్ష్మీ నారాయణన్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు, ఐఎఫ్‌ఎంఆర్ డీన్ ప్రొఫెసర్ లక్ష్మీ కుమార్, ఎస్ ఐ ఎ ఎస్ అకడమిక్ డీన్ డాక్టర్ పథ్వీ దత్తా చంద్ర శోభి, రీసెర్చ్ విభాగం డీన్ ప్రొఫెసర్ శివకుమార్ శ్రీనివాసన్, ఇతర క్రియా అధికారుల సమక్షంలో పట్టాలను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా క్రియా విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఛాన్సలర్ ఎన్.వాఘుల్‌కు నివాళులర్పించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు, ఆశాజనిక భవిష్యత్తు కోసం వాఘుల్ నాయకత్వంలో క్రియా స్థాపించబడిందన్నారు. ఈ రోజు ఆయన లేకున్నా లక్ష్యం నెరవేరిందన్నారు. సామాజిక, ఆర్థిక పురోగతికి సంబంధించిన సవాళ్లను ఎదుర్కొనే మనస్తత్వంతో పాటు సంకల్పం, నైపుణ్యాలు, వనరులు కలిగిన రానున్న తరాల నాయకులను పెంపొందించడం తమ విద్యా విధానం విశిష్టతగా ఆమె అభివర్ణించారు. డాక్టర్ విజయరాఘవన్ మాట్లాడుతూ, విభిన్న దక్కోణాల విద్యా ప్రాముఖ్యతను వివరించారు.



బోధనేతర ఎన్నికలకు సహకరించండి

ప్రజాశక్తి - క్యాంపస్



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బోధనేతర సంఘం నూతన కమిటీ ఏర్పాటుకు నిర్వహిస్తున్న ఎన్నికలలో ప్రతి ఒక్కరు సహకరించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సహకరించాలని ఎన్నికల అధికారి మహమ్మద్ షఫీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ క్యాంపస్ లో ప్రశాంతంగా బోధనేతర సిబ్బంది సంఘం ఎన్నికలు నిర్వహించడానికి అభ్యర్థులు అందరూ తప్పనిసరిగా ఈ క్రింది సూచనలు పాటించాలని కోరారు. 1.ప్లాస్టిక్ బ్యానర్ నిషేదం, 2.గోడలపై నోటీసులు అటించడం నిషేధం, 3.భవనాలు, రహదారులపై రాతలు రాయడం నిషేధమనీ అన్నారు. పై సూచనలు అతిక్రమించిన యెడల యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేయబడునని పేర్కొన్నారు.

వీళ్లు మారరంతే...!

బదిలీలకు 'విరమణ' సాకు
ఎక్కడి వారు అక్కడే విధులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయాధికారుల తీరు నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ప్రభుత్వాలు మారినా అధికారులు చిత్ర విచిత్రంగా, వింత వింతగా వ్యవహరిస్తూ ఉండడం సహజంగా మారింది. ఎవరెన్ని విమర్శలు చేసినా ఏమాత్రం పట్టించుకోరు. 'నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు, తిట్టి పోదురు గాక నాకేటి ఎగ్గు' అనే విధంగా వ్యవహరించడం వీరి ప్రత్యేకత. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్ రెడ్డి గెలిచిన మరుసటి రోజే ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. ఏళ్ల తరబడి ఒకే సీటులో ఉన్న సిబ్బందిని వివిధ విభాగాలకు మార్పు చేయాలని సూచించారు. అంతేగాకుండా తయారైన బదిలీ జాబితాను ఆయన పరిశీలించి కొన్ని మార్పులు కూడా చేశారు. వెంటనే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. వారం రోజుల క్రితం బదిలీ జాబితా తయారైనా ఇప్పటివరకు బయటకు రాలేదు. ఎమ్మెల్యే ఆదేశాలను సైతం ఖాతరు చేయక ఎక్కడి అధికారులు అక్కడే విధులు నిర్వర్తిస్తుండటం గమనార్హం.

బదిలీలకు "విరమణ" సాకు

ఆలయంలో అంతర్గత బదిలీలు చేపట్టాల్సిన పాలనాధికారి కేవలం కార్యాలయానికి, సంతకాలకు మాత్రమే పరిమితమయ్యారు. ఈనెల 30వ తేదీన ఈవో నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఒకటో తేదీ నుంచి కొత్త ఇవో రానున్నారు. దీంతో అంతర్గత బదిలీలు కూడా కొత్త ఈవో ద్వారానే జరిపించాలని నాగేశ్వరరావు ఆలోచన అయ్యి ఉండచ్చని భావిస్తున్నారు.

గతంలో బదిలీల పండగ

అంతర్గత బదిలీలు అంటే గతంలో జాతర లాగా ఉండేది. ఒక్కో సీటుకు వేలం పాట పెట్టి ఎక్కువ ధర పలికిన వారికి ఆ సీటును కేటాయించే వారనే అపవాదు ఉంది. సాధారణంగా ఆలయంలో ఉద్యోగుల అంతర్గత బదిలీలు తరచూ జరుపకూడదనే నిబంధన ఉంది. ఒక వేళ తప్పనిసరి అయితే దేవాదాయ శాఖ అనుమతి తప్పనిసరి. అయితే గత పాలకులు ఎప్పుడు పడితే అప్పుడు నిబంధనలకు విరుద్ధంగా అతర్గత బదిలీలు నిర్వహించారు. వారూ.. వీరూ కోరుకున్న చోట డ్యూటీలు ఇచ్చారు. దీంతో పెద్ద ఎత్తున పైరవీలు జరిగాయని సమాచారం. అయితే అలాంటి సంప్రదాయానికి స్వస్తి పలికి ఎటువంటి వేలం పాట లేకుండా, ధరలు నిర్ణయించకుండా అంతర్గత బదిలీలు చేయడం అధికారులకు ఇష్టం లేనట్లుంది. కొత్త ఎమ్మెల్యే ఆదేశించినా ఇప్పటివరకు అమలు కాకాకపోవడంపై ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు. ఉద్యోగ విరమణకు ముందే నాగేశ్వరావు బదిలీలు చేస్తారా..! లేదా కొత్త ఇవో వచ్చి చేస్తారా..!!.. అనేది వేచి చూడాల్సిందే మరి.



గురుకులాన్ని పరిశీలించిన డిఎంహెచ్ఓ


చికిత్స పొందుతున్న విద్యార్థులను పరిశీలిస్తున్న డిఎంఅండ్‌హెచ్‌వో

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పురపాలక సంఘం పరిధి చెన్నూరులోని గిరిజన గురుకుల పాఠశాలను తిరుపతి డిఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీహరి సోమవారం పరిశీలిం చారు. రెండు రోజుల క్రితం గురుకుల పాఠశాలలో కలుషిత నీరు తాగి ఎనిమిది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న డిఎంఅండ్‌హెచ్‌వో పాఠశాలను పరిశీలించారు. ఈ సంఘటనపై ప్రిన్సిపాల్ మధుసూదన్‌తో మాట్లా డారు. అనంతరం పాఠశాల చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. అక్కడ ఉన్న సిబ్బందికి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పాఠశాలలోని స్టోర్ రూమ్ సామగ్రిని పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్‌కు పలు సూచనలు, సలహాలు అందించారు.


ప్రజా వేదిక అర్జీలను తక్షణం పరిష్కరించాలి : తహాశీల్దారు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా వేదికలో వచ్చిన అర్జీలపై తక్షణం విచారణ చేపట్టి పరిష్కరించాలని డిప్యూటి తహాశీల్దారు చంద్రబాబునాయుడు తెలిపారు. మండల తహాశీల్దార్ కార్యాలయంలో వీర్వోలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ప్రతి సోమవారం వచ్చిన ఆర్జీలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ ప్రజా వేదికకు మండలంలోని అన్ని శాఖల అధికారులు వచ్చి వారి వారి శాఖల సమస్యలపై పరిష్కారం చూపాలన్నారు. భూ సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు నాగరాజు, వీఆర్వోలు , కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

శెట్టిపల్లి రహదారి పనులు ముమ్మరం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం రవాణా శాఖ కార్యాలయ కూడలి నుండి శెట్టిపల్లి రైల్వే గేటు వరకు నిర్మించ తలపెట్టిన 80 అడుగుల రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. టిటిడి నిధులతో గత ప్రభుత్వంలో మాజీ టిటిడి ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి నిర్మించాలని రూ.15.12 కోట్ల రూపాయలను మంజూరు చేయించారు. నిర్మాణ పనులు తెలుగుగంగ లీకేజీల కారణంగా ఇన్నాళ్లు ఆలస్యంగా పనులు కొనసాగాయి. ఇటీవల 'శెట్టిపల్లి మార్గం పనులు నత్తనడకన' అన్న శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీంతో గుత్తేదారు పనుల్లో వేగం పెంచి రోడ్డు వెడల్పు కోసం అడ్డుగా ఉన్న చెట్లను తొలగించి విద్యుద్దీకరణ కోసం ఇప్పటికే నాటిన విద్యుత్ స్తంభాలకు వైర్లను లాగుతున్నారు. పనులలో వేగం పెరగడంతో ఈ మార్గంలో ప్రయాణించే పాదచారులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మిథున్ రెడ్డిని కలిసిన హరిప్రసాద్ రెడ్డి


ఎంపి మిథున్‌రెడ్డిని కలిసిన హరిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాజంపేట పార్లమెంట్ సభ్యునిగా విజయం సాధించిన తమ అభిమాన నాయకుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ముచ్చటగా మూడోసారి రాజంపేట పార్లమెంట్ సభ్యునిగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించి సోమవారం పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా యువ నాయకుడు హరి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని గౌరవ పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు నాయకులు హరీష్ రెడ్డి, సత్యవేడు నాయకులు ధీరేంద్ర వర్మ, బివి ఆర్ చౌదరి, మమ్మిడివరం శ్రీను రాజా, రాహుల్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ని కలిసిన ఆనంద్ గౌడ్

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్య, ఐటి,ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రివర్యులు సోమవారం వెలగపూడి సచివాలయం బ్లాక్ 4లో బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్ కు బీసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నారికొండ్ల బ్రహ్మం చౌదరి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మంత్రితో మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో విద్యావ్యవస్థ పూర్తిగా కుంటు పడిపోయిందని, విశ్వవిద్యాలయాల్లో అధికారుల అవినీతి తారా స్థాయికి చేరిందని, ఉన్నతి విద్యా మండలి ఛైర్మన్ గా ఉన్న వ్యక్తి విశ్వవిద్యాలయాలను సర్వనాశనం చేశాడని, విద్యా వ్యవస్థను పక్కదారి పట్టించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విశ్వవిద్యాలయాల్లో వీసీలను, ఉన్నతాధికారులను తొలగించి ప్రక్షాళన చేయాలని వారు మంత్రిని కోరారు.


మంత్రి లోకేష్‌ను కలిసిన ఆనంద్ గౌడ్

ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలి: డాక్టర్ రెడ్డి ప్రసాద్

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: వెంకటగిరి మండలంలోని మొగల్గుంట పంచాయతీ పరిధిలోని వెల్నెస్ సెంటర్‌లో ప్రజలకు ఉచిత వైద్య సేవలు సోమవారం జీకే పల్లి పీహెచ్‌సి డాక్టర్ రెడ్డి ప్రసాద్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల నాలుగో సోమవారం 104 సిబ్బంది ద్వారా వెల్నెస్ సెంటర్‌లో రోగులకు ఉచిత వైద్యం, మందులు పరీక్షలు నిర్వహించి ఇస్తామని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు తప్పనిసరిగా ప్రతినెల పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని సూచించారు. అనంతరం గర్భవతులు, బాలింతలకు పరీక్ష వైద్య సలహాలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైది సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి -నాయుడుపేట: సమాజంలో రోజురోజుకి పెరిగిపోతున్న మత్తు పదార్థాల వాడకాలను అరికట్టేందుకు వరల్డ్ యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా నాయుడుపేట అర్బన్ సిఐ శ్రీనివాసులు రెడ్డి నాయుడుపేటలోని శ్రీ వేమా జూనియర్ కాలేజీలో సోమవారం అవగాహన ఏర్పాటు చేశారు. డ్రస్సు వాడడం వల్ల జరిగే నష్టాల గురించి విద్యార్థిని విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించి డ్రగ్స్ ను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేమ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి, సెబ్ సిఐ అరుణ్ కుమారి,సెబ్ ఎస్ఐ మునీర్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: మత్తు పదార్థాల వినియోగం వల్ల బతుకులు చిత్తవుతున్నాయనీ, యువత జాగరూకతతో మసులుకోవాలని శ్రీకాళహస్తి డిఎస్పి ఉమామహేశ్వర్ రెడ్డి సూచించారు. స్థానిక వంశీ డిగ్రీ కాలేజీ ఆవరణలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు.

ఎంపి మద్దెల గురుమూర్తి ప్రమాణస్వీకారం



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుపతి పార్లమెంటు సభ్యుడిగా వైసిపి నుండి ఎన్నికైన మద్దిల గురుమూర్తి సోమవారం ఢిల్లీ పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడుతూ జగ్నన్న ఆశీస్సులతో తిరుపతి పార్లమెంట్ ప్రజల ఆదరాభిమానాలతో పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయ్యానని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తిరుపతి పార్లమెంట్ ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి కృషి చేస్తానని తెలిపారు. తన విజయం కోసం అహర్నిశలు కషి చేసిన వైసిపి నాయకులు, కార్యకర్తలు అందరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.

ఎవాస్ 'ఘర్ ధడక్నె దో' క్యాంపెయిన్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: భారతదేశపు ప్రముఖ నిర్మాణ సామగ్రి కంపెనీ ఇన్ఫ్రా మార్కెట్, తన డైరెక్ట్–టు–కన్స్యూమర్ (డి2సి) బ్రాండ్ 'ఘర్ ధడక్నె దో' క్యాంపెయిన్ ప్రారంభించిందని ఇన్ఫ్రా మార్కెట్ సహ వ్యవస్థాపకులు ఆదిత్య శర్మా తెలిపారు. ఇల్లు అనేది కేవలం భౌతికమైన స్థలం మాత్రమే కాదని, అది మన గుర్తింపుని ప్రతిఫలిస్తుందన్న ఆలోచనని నమ్ముతామన్నారు. మనుషులు ఇళ్ళతో పెంచుకునే సంబంధాన్ని మా క్యాంపెయిన్ వేడుక చేస్తుందన్నారు. కలల నివాసాన్ని నిర్మించు కోడానికి ఎవాస్ విశ్వాసనీయ భాగస్వామిగా నిలుస్తుందన్నారు. గృహిణులు, గృహాల మధ్య వేళ్ళూనుకుని బలమైన సంబంధాన్ని గుర్తిస్తుందన్నారు. మనలాగే మన ఇళ్ళు కూడా శ్వాసిస్తాయి, జీవిస్తాయన్న వాస్తవాన్ని ఈ క్యాంపెయిన్ వేడుక చేస్తుందన్నారు. మనకెంతో ఇష్టమైన కుటుంబ సభ్యుల పట్ల చూపించే సంరక్షణ, ఇంటిని కూడా చూసుకోవాలన్న ఆలోచన లక్ష్యంగానే ఇది సాగుతుందని తెలిపారు. గుండెల నిండా ఆప్యాయతతో ఇళ్ళను తమ పిల్లల్లా, కుటుంబ సభ్యునిలా లేదా స్నేహితునిలా చూసుకుంటారన్నారు.

మహిళా వర్సిటీలో వర్క్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, నాందీ ఫౌండేషన్ సంయుక్తంగా ఎంప్లాయబిలిటీ స్కిల్స్ అనే వర్క్ షాపు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో నిర్వహించారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ వర్క్ షాప్ కు మహిళా యూనివర్సిటీ ఉపకులపతి డి.భారతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

భూస్వామికి పట్టా ఇచ్చిన తహశీల్దారుపై చర్య తీసుకోవాలి

కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం యనమలపాళెం దళితులకు ఇచ్చిన పట్టాలు ఆక్రమించిన భూస్వామికి పట్టాలు ఇచ్చిన తహశీల్దారుపై చర్య తీసుకుని సస్పెండ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకటేష్ ఆధ్వర్యంలో తిరుపతి కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ వడమాలపేట మండలంలోని యనమల పాలెం తిరుమండ్యం రెవెన్యూ లెక్క దాఖల్లో సర్వే నంబర్ 195 బార్ మూడులో ఐదు ఎకరాల 12 సెంట్లు ప్రభుత్వం స్థలం వుండగా దానిలో యనమల పాలెం ఆదిఆంధ్రవాడ దళితులకు మూడు ఎకరాల్లో 60 మందికి ఇళ్ల పట్టాలు సాంఘిక సంక్షేమ వారి ద్వారా 1982లో పట్టాలిచ్చారన్నారు. మిగతా ఉన్న రెండు ఎకరాల 12 సెంటు భూములను వడమాలపేటకు చెందిన చంగయ్య, సిద్ధప్ప అనే భూస్వాములు ఆక్రమించుకోవడం దారుణమని ఆయన పేర్కొన్నారు. ధర్నా లనంతరం కలెక్టర్‌కి, డిఆర్ఓకి వినతి పత్రం అందించారు. అధికారుల స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి నందయ్య, ఎంఆర్‌పిఎస్ నాయకులు శివ గ్రామస్తులు బాలముని, రాజా, నాగముని, దాము, ధనంజయులు మహిళలు పాల్గొన్నారు,.

అర్జీలను అర్థవంతంగా పరిష్కరించాలి: కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్:


ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు సకాలంలో అర్థవంతమైన పరిష్కారం చూపాలని, లేనిచో చర్యలు తప్పవని కలెక్టర్ ధ్యాన చంద్ర హెచ్ఎం అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ తో పాటు డిఆర్ఓ పెంచల్ కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళి, దేవేంద్ర రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను ఆన్లైన్ లో పొందుపరచి బియాండ్ ఎస్ఎల్ఏకి వెళ్లకుండా నిర్ణీత సమయం లోగా పరిష్కరించాలన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సదరు పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు హాజరు కావాల్సి ఉంటుందని అన్నారు. మొత్తం 119 వినతులు అందాయి.



మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్

ప్రజాశక్తి - సత్యవేడు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్దన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో రైతులను ప్రభుత్వం ప్రోత్సహించి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మామిడి చెట్లు పెంపకానికి ఉచితంగా చెట్లు నాటిన ప్రభుత్వం నేడు కార్పొరేట్ కంపెనీల దయాదాక్షిణ్యాలపై రైతులు తమ పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్లో మామిడి గుజ్జుతో తయారైన రసాలకు ఏమాత్రం ధర తగ్గక పోయినా రైతుల నుండి సేకరించే మామిడి కాయల ధరను మాత్రం తగ్గించి డిమాండ్ లేదనే సాకుతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను నష్టపరిచే విధంగా జ్యూస్ పరిశ్రమ యాజమాన్యాలు రైతులను దోచేస్తుంటే ప్రభుత్వాలు తమకేమీ పట్టనట్లు ఉండడం సరికాదన్నారు. చిత్తూరు కలెక్టర్ స్పందించి టన్ను 30 వేల రూపాయలకు తోతాపురి కొనుగోలు చేయాలని ప్రకటించినా యాజమాన్యాన్ని ఆదేశించినా ఫలితం లేదని, తక్కువ ధరకే సేకరిస్తున్నారని పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున పురుగుల వల్ల చెడిపోతాయని రైతులు ఆందోళనతో వచ్చినంత సొమ్ముకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకున్న యాజమాన్యాలు తక్కువ ధరకే కొంటున్నాయని తెలిపారు. నూతన ప్రభుత్వం రైతుల కోసం పరిశ్రమ యజమానులతో సంప్రదించి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.



ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి - రామచంద్రాపురం, చంద్రగిరి: రాష్ట్రంలోని ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేస్తున్నారని, ప్రతి ష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అధికారులను ఆదేశించారు. చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులకు రసీదులు ఇచ్చి, రికార్డులలో నమోదు చేయాలన్నారు. ఫిర్యాదులపై అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యల నివేదికను బాధితులకు అందించా లన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలో చేరేందుకు అవసరమైన కుల, ఆదాయ, ఈ బీసీ, ఓబిసి ధ్రువ పత్రాలను విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా అధికారులు మంజూరు చేయాలని కోరారు. రైతులకు సంబంధించిన భూ సమస్యలపై రెవెన్యూ రికార్డులను, కొనుగోలు డాక్యుమెంట్లను మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరి నుండి దరఖాస్తులు స్వీకరించి సంక్షేమ పథకాలను మంజూరు చేయించాలని సూచించారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురి కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నిరుప యోగంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండు సమస్యను పరిష్కరించాలని, గతంలో రేణిగుంట–చంద్రగిరి ప్రాంతాల మధ్య తిరిగే టౌన్ సర్వీసులను పునరుద్ధరించాలని, చంద్రగిరిలో గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా అరికట్టాలని పలువురు కోరారు. దీనిపై సంబం ధిత అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. చంద్రగిరి పట్టణాన్ని గంజాయి, డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దుతానని తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ అనితను ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్ ను ఉపయోగంలోకి తీసుకువచ్చి, గతంలో రేణిగుంట చంద్రగిరి, తిరుపతి– చంద్రగిరి మధ్య నడిచే టౌన్ సర్వీస్‌లను నెల రోజుల్లో పునరుద్ధరించి ప్రజలకు రవాణా సౌకర్యాలు కల్పిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్య సాయి, తహశీల్దారు మారుతి, ఎస్ఐ అనిత అన్ని శాఖల అధికారులు, స్థానిక టిడిపి నాయకులు వి సుబ్రహ్మణ్యం నాయుడు, ఎస్ గౌస్ బాషా, వి రమేష్ రెడ్డి, వేణుగోపాల్, ప్రజలు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


ప్రజల నుండి సమస్యలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పల్లమాల సచివాలయంలో మాతా శిశు మరణాల నివారణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం బుచ్చిరాయుడు కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ శ్రీనివాస రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. ఆయన నేతృత్వంలో జిల్లా గణాంక అధికారి నాగేంద్ర డిపిహెచ్ఎన్ ఇన్‌ఛార్జి బేబీ రాణి, డిపిఓ ప్రకాష్, మండల బిఎన్ కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలు, రక్తహీనతతో మృతి చెందకుండా జాగ్రత్త వహించి వారికి తగిన వైద్య సదుపాయాలు కల్పించి రక్తహీనత లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి కాన్పు ప్రభుత్వ హాస్పిటల్లోనే నిర్వహించు కునేలా చూడా లన్నారు. బుచ్చి నాయుడు కండిగ గ్రామం లోని గర్భిణులకు, యుక్త వయసు పిల్లలకు హిమో గ్లోబిన్ పరీక్షలు చేసి తక్కువగా ఉన్న వారికి తగిన సలహాలు, సూచన లు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీలలో బాలింతలకు, గర్భిణులకు ఇచ్చే బలవర్ధక ఆహారాన్ని తప్పకుండా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోఏఎన్ఎం, ఎమ్మెల్ హెచ్‌పిఓలు రికార్డుల పనితీరును పరిశీలించి వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ప్రకాష్, వైద్యాధికారి డాక్టర్ దివాకర్, సచివాలయ సిబ్బంది సూపరువైజర్స్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్సు అధికారి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే పాశింకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేసేందుకు అసెంబ్లీకి వెళ్లి సమావేశాల్లో పాల్గొని సోమవారం నియోజక వర్గానికి చేరుకున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కు టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. గూడూరు విఘ్నేశ్వరపురం నుండి గాంధీ బొమ్మ , రాజా వీధి మీదుగా టవర్ క్లాక్ సెంటర్ మీదుగా పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం టిడిపి నేతలు బాణ సంచా పేల్చి , స్వీట్లు పంచిపెట్టారు. క్రేన్ సాయంతో గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు నియోజవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని వారి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొ న్నారు. గూడూరు పట్టణంలో మౌలిక వస తుల కల్పనకు , పార్టీ ఆఫీసులో కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గూడూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం అని పేర్కొ న్నారు. గూడూరు మున్సిపాల్టీ ఎన్నికలు నిర్వహించేలా అధిష్టానంతో మాట్లాడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తానంకి నానాజీ , సోమిశెట్టి చెంచు రామయ్య, చాన్ బాషా, వాటంబేడు శివ కుమార్ , సోమిశెట్టి సాయి కృష్ణ , పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీమ్, నెలబల్లి భాస్కర్ రెడ్డి , బయ్య మోహన్ రావు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

జక్కంరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం

- బీటెక్ విద్యార్థి వైద్యానికి రూ.40వేల ఆర్థిక సాయం
- లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ ఛైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సీనియర్ లయన్ జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సేవలు స్ఫూర్తి దాయకమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ ఛైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ అన్నారు. గూడూరు డీఎన్ఆర్ కమ్యూనిటీ ఆడిటోరియంలో బీటెక్ విద్యార్థి వైద్య ఖర్చులకు లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి సోమవారం 40 వేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఓజిలి మండలం పెద్ద పరియ గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి బుస్సారెడ్డి రేవంత్ రెడ్డి ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి పడిపోయాడన్నారు. దీంతో వెన్నెముక దెబ్బతిందన్నారు. పేద విద్యార్థి వైద్యం కోసం లయన్స్ క్లబ్ తరపున రూ.20 వేలు, సీనియర్ లయన్ జక్కం రెడ్డి శ్రీనివాసులురెడ్డి రూ.20వేలు కలిపి 40 వేల రూపాయలు రేవంత్ రెడ్డి తండ్రి శ్రీనివాసులురెడ్డికి అందించా మన్నారు. జక్కంరెడ్డి ఔదార్యం అభినందనీ యమన్నారు. లయన్స క్లబ్ అధ్యక్షుడు రవి చంద్ర, డిస్ట్రిక్ ఛైర్మన్ మల్లెమాల మురళీరెడ్డి, వాకాటి రామ్మోహన్ రావు తదితరులు బీటెక్ విద్యార్థి రేవంత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సీనియర్ లయన్ జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమానికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మదన మేటి రమణయ్య, కల్యాణ్ సాయి, రూపేష్ రెడ్డి, వీరేంద్ర నాథ్ పాల్గొన్నారు.


విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

'పిఎస్' కాలనీ సమస్యలను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు పట్టణంలో ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పుట్ట శంకరయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ సుందరయ్య కాలనీలో గత కొంతకాలం నుండి వర్షం వచ్చినప్పడల్లా కాలనీలో ఉన్న సగానికి పైగా ఇల్లు లోకి నీళ్లు వచ్చేస్తున్నాయని దీనివలన స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు . తాగడానికి నీరు కూడా లేదని, సుమారు నాలుగు బోర్లు మరమ్మతుల కు గురయ్యాయని తెలిపారు. వీధిలైట్లు వెలగడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్రీనివాసులు, సురేష్ , నారాయణ పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి జిల్లాలో విద్యా రంగంలో నెలకొన్న పలు రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సోమవారం ప్రజా పరిష్కార వేదికలో భారతీయ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ జిల్లాలో సాంఘిక, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. వైరింగ్, బాత్రూం, తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, బాల తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : తిరుపతి నగర పారిశుధ్య కార్మికులు నివసిస్తున్న యానాది కాలనీలోని మున్సిపల్ స్కూల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని వేమన విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎం.నాగార్జున డిమాండ్ చేశారు. స్కూల్లో బాత్రూమ్‌ల నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయన్నారు. తాగునీటి ప్లాంట్ అమర్చలేదన్నారు. ఈ మేరకు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

క్రైం న్యూస్

హత్య కేసులో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మాదం ప్రసాద్ హత్య కేసులో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు అలిపిరి పోలీసులు వెల్లడించారు. ఈనెల 14న ఆటో నగర్ లో ముంగిలి పట్టుకు చెందిన మాధం ప్రసాద్‌ను దారుణంగా గొంతు కోసి హత్య చేసిన విషయం తెలిసిందే. హత్య కేసులో అలిపిరి పోలీసులు నలుగురిని నిందితులుగా గుర్తించారు. ఆటోనగర్ కు చెందిన కచ్చిలేటి వెంకటేష్, చైతన్య పురానికి చెందిన సుంకర కిరణ్ కుమార్, తమిళనాడు కాంచీపురానికి చెందిన నీలకంఠం గా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మరో నిందితుడు మైనర్ కావడంతో అతడిని జువైనల్ హోమ్ కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి, రాజంపేట పరిధిలోని తుమ్మలబైలు అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి ఐదు ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా పరిరక్షణ ప్రత్యేక కార్యదళం ఇన్‌ఛార్జి, తిరుపతి ఎస్‌పి హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ సూచనలతో ఆర్ఎస్ఐ రాఘవేంద్ర బృందం ఆదివారం సాయంత్రం నుండి శేషాచలం అటవీ పరిధిలోని అన్నమయ్య జిల్లా రాజంపేట తుమ్మల బెయిల్ సెక్షన్ వద్ద కూంబింగ్ చేపట్టారు. సోమవారం బట్టేడుకోన, పుట్టంగి మడుగు మీదుగా వలసలు మీది వైపు వెళుతుండగా ఆ ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకు వెళ్లడం గమనించారు. వెంటనే అప్రమత్తమై వారిని చుట్టుముట్టేందుకు యత్నించగా వారు దుంగలను పడేసి పారిపోతుండగా వెంబడించి తమిళనాడు వేలూరు జిల్లాకు చెందిన పొన్నుస్వామి రాజీ, ప్రభువెల్లియన్ అనే ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. అదుపులోకి తీసుకున్న వారు మరి కొందరు స్మగ్లర్లు అడవిలో ఉన్నట్టుగా సమాచారం ఇచ్చారని, వారికోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టమన్నారు.

ఇద్దరు వేటగాళ్లు అరెస్టు

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: భాకరాపేట రేంజ్ భాకరాపేట బీటులో ఇద్దరు వేటగాళ్లు అటవీ జంతువులను వేటాడుతున్నట్టు అందిన రహస్య సమాచారం మేరకు చిత్తూరు జిల్లా, వెదురు కుప్పం మండలానికి చెందిన సురేష్ (29), శ్రీనివాసులు(21)ను అరెస్టు చేసి కణితి మాంసం, నాటు తుపాకి, ద్విచక్ర వాహణంతో సహా ఇద్దరిని పట్టుకొని అరెస్టు చేసి సోమవారం పీలేరు కోర్టులో హాజరు పరిచామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దత్తాత్రేయ తెలిపారు.ఈ దాడిలో ఐఎఫ్ఎస్‌వో ఎస్సార్ తౌఫిక్ అస్లామ్, ఎఫ్‌బిఓలు ఎమ్.సదాశివం, ఎమ్ లోకనాధం ,ప్రొటెక్షన్,స్ట్రైకింగ్ ఫోర్స్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నట్టు పేర్కొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించండి..

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈవో మునిసుబ్రమహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీలోని ఎంపీపీ పాఠశాలలో ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు రామదాసు ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల పరిధిలోని తలారివెట్టు గిరిజన కాలనీలో బడి ఈడు, బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని పాఠశాల ప్రధానోపా ధ్యాయులు రూపేష్ కుమార్ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఏపీ ఆర్ సెట్ 2023-24 ఇంటర్వ్యూలు ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి చేపట్టిన ఏపీ ఆర్‌సెట్ 2023 –24 ఇంటర్వ్యూలు ఈ నెల 24వ తేదీ నుండి ప్రారంభమయ్యాయని ఏపీ ఆర్ సెట్ కన్వీనర్ బి దేవప్రసాదరాజు సోమవారం పేర్కొన్నారు. 24వ తేదీ నుండి 28 వ తేదీ వరకూ ఇంటర్వ్యూలు వుంటాయని తెలిపారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన 12 యూనివర్సిటీల్లో ఇంటర్వ్యూల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పీహెచ్‌డీలో ప్రవేశానికి 10 వేల మంది దరఖాస్తు చేయగా, వీరిలో 4,352 మంది ఉత్తీర్ణత పొంది ఇంటర్వ్యూలకు హాజరు కానున్నారు. ఆయా యూనివర్సిటీల్లోని సంబంధిత డిపార్టుమెంట్లలో ఇంటర్వ్యూ చేపడతారు. సమగ్ర వివరాలు కోసం.. హెచ్‌టిటిపి// సెట్స్.ఏపీఎస్‌సిహెచ్‌ఇ.ఏపీ.జిఒవి.ఇన్ లో చూడవచ్చని కన్వీనర్ తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి: ఎంపిడివో

ప్రజాశక్తి - బాలాయపల్లి : పారిశుధ్యంపై సచివా లయం, పంచాయతీ కార్యదర్శిలు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరి ష్క రిం చాలని ఎంపీడీఓ అరుణ పేర్కొ న్నారు. స్త్రీ శక్తి భవనంలో పారిశుధ్యం పనులపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యం లేకుండా చూడాలన్నారు. అన్ని గ్రామాలకు సంబంధించిన అధికారులు సంబంధిత రికార్డులను సిద్ధం చేసుకోవాలన్నారు. డ్రైనేజి పారుదల, పారిశుధ్యం సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి మెరుగు పరచా లన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసులు, అర్ డబ్ల్యూఎస్ ఏఈ, మండల శాఖ అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మోసపూరిత ప్రకటనలు నమ్మొద్దు : హెచ్‌డిఎఫ్‌సి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: వాట్సాప్ గ్రూపు లలో, సోషల్ మీడియాలో వస్తున్న మోసపూరిత ప్రకటనలు నమ్మవద్దని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ప్రముఖ స్టాక్ బ్రోకిం గ్ కంపెనీ అనుబంధ సంస్థ, హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ లిమిటెడ్ సిఓఓ సందీప్ భరద్వాజ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నకిలీ వాట్సాప్ గ్రూపులతో కంపెనీ, దాని అధికారుల వలె నటిస్తూ మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి పట్ల అప్రమత్తత తో వ్యవహరిస్తూ, వారి బారిన పడకుండా ఉండాలని వినియోగదారులను హెచ్చరించారు. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ పెట్టుబడిదారులందరూ స్టాక్ మార్కెట్‌లో సూచనాత్మకమైన, హామీ ఇచ్చిన, గ్యారెంటీడ్ రాబడిని అందిస్తుందనే ఏదైనా స్కీమ్, ప్రోడక్ట్‌కు సబ్‌స్క్రయిబ్ ప్రకటనలు వస్తే వాటిని ఓపెన్ చేయవద్దని సూచించారు. సున్నితమైన సమాచారాన్ని వినియోగదారుల నుంచి రాబట్టడం తో పాటుగా నిధులను తస్కరించవచ్చు. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ యూజర్ ఐడి, పాస్‌వర్డ్ వంటి ట్రేడింగ్ ఆధారాలను ఇవ్వవద్దని హెచ్చరించారు. వినియోగదారులకు ఏదైనా సమస్య ఎదురైతే హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ కస్టమర్ సర్వీస్ 022–39019400లో సంప్రదించాలని సూచించారు.

పార్కు స్థలానికి విముక్తి కల్పించండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతిలోని సాయి విష్ణు లేఅవుట్ కు సంబంధించిన పార్కు స్థలాన్ని గత వైసిపి ప్రభుత్వం లో ఉన్న ప్రజా ప్రతినిధులు కబ్జా చేశారని, వారి నుంచి విముక్తి కల్పించాలని టిడిపి తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎం సుగుణమ్మ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం జరిగిన ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. తొమ్మిది ఎకరాలు పార్కుకు కేటాయిస్తే అందులో ఐదు ఎకరాలు కబ్జా చేశారని, ఆ పార్కును బాధితులకు అందించేలా కమిషనర్ చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దంపురి భాస్కర్ యాదవ్, సాయి విష్ణు లేఔట్ బాధితులు పాల్గొన్నారు

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE : TIRUPATI
E.A. No. 121/2024, OEP No. /2024
O.S. No. 114/2022
C. Prasad Reddy ... D.Hr. / Plaintiff
Vs
Kola Ravi Shankar ... J.Dr./ Defendant
E.A NOTICE TO JUDGEMENT DEBTOR / DEFENDANT :
J.Dr. : కోలా రవిశంకర్, తండ్రి లేట్ కె.వెంకటరమణయ్య, డోర్ నెం. 1-5-551/19, ఫ్లాట్ నెం.503, బాలాజి టవర్స్, ఎల్.ఐ.సి.గెస్ట్‌హౌస్ ఎదురుగాను, కె.సి.ఆర్. అపార్ట్‌మెంట్, తిరుపతి అర్బన్ మండలం, తిరుపతి జిల్లా.
పై నెంబరు కేసులో J.Dr./Defendant నిప్పైన D.Hr. / Plaintiff డిక్రీ అమలు జరుపుటకొరకు దావా వేసియున్నారు, సదరు అమలు దావాలో నోటీస్ నిమిత్తం J.Dr./Defendant అయిన మీ కొరకు 03-07-2024 తేదీన వాయిదా వేయబడినది. ఆ దినం అనగా 03-07-2024 తేదీన పైన తెలిపిన కోర్టులో ఉదయం 10.30గం॥లకు J.Dr./Defendant అయిన మీరు లేదా మీ వకీలు ద్వారా గాని హాజరై దీనిపై ఏదేని అభ్యంతరములు వున్నయెడల తెలియపర్చవలెను. లేనిచో కోర్టువారు తగు ఉత్తర్వులు జారీ చేయుదురు.
Hg. Date : 03-07-2024
వి. ఉపేంద్ర, యం. వినోద్,
వాది తరుపున న్యాయవాదులు, తిరుపతి